క్లుప్తంగా

విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

మద్దిలపాలెం: ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్ మేనేజ్‌మెంట్, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టంపై నాలుగో బ్యాచ్ శిక్షణ కార్యక్రమం సోమవారం నోడల్ రిసోర్స్ సెంటర్ అయిన కృష్ణా కళాశాలలో ప్రారంభమైంది. ఈ శిక్షణ వచ్చేనెల ఒకటో తేదీ వరకూ ఉంటుందని నోడల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. విద్యార్థుల్లోని నైపుణ్యానికి పదును పెట్టి వారిలో ఉపాధికి దోహదపడే వృత్తులపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌కు దోహదపడే అంశాలను విద్యార్థులకు వివరించాలన్నారు. శిక్షణ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ నైపుణ్యంతో విద్యార్థుల ఉజ్వల భవితకు దిశానిర్దేశం చేయడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ట్రైనర్లు శ్రీనివాస్, ప్రసాద్, విద్యాసాగర్, సిహెచ్.లలిత, కె.రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో ప్రత్యేక వైద్య శిబిరం



అధ్యాపకులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల జాతీయ సేవా పథకం, ఇన్నర్ వీల్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సత్య బృందం సంయుక్తంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశాయి. అధ్యాపకులు, విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. విశాఖ కంటి ఆస్పత్రి వైద్యులు నేత్ర పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.వి జయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, డాక్టర్ రత్నభారతి, డాక్టర్ సుధీర్ పాల్గొన్నారు.

'జీ-20 సదస్సు పేరిట నిధులు దుర్వినియోగం'

మద్దిలపాలెం: విశాఖ వేదికగా జీ–20 సదస్సు నిర్వహణ కోసం కోట్లాది రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు ఆరోపించారు. పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చేనెల ఒకటో తేదీన జరిగే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ప్రమాదకరమైన అంశాలపై తీర్మానం చేయనున్నారని విమర్శించారు. ముడసర్లోవ, పూర్ణామార్కెట్‌ను పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి చూస్తున్నారన్నారు.

హర్యానా గవర్నర్ దత్తాత్రేయకు ఘన వీడ్కోలు



దత్తాత్రేయకు వీడ్కోలు పలుకుతున్న బీజేపీ నాయకులు

ఎంవీపీ కాలనీ: హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయకు బీజేపీ నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన విశాఖ వచ్చిన విషయం తెలిసిందే. సోమవారం ఆయన తిరిగి ప్రయాణం కాగా.. విమానాశ్రయంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు, పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, పార్టీ నాయకులు ఉమ్మడి సుజాత, సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, రామ్‌కుమార్, మురళీకృష్ణరాజు తదితరులు వీడ్కోలు పలికారు.

ఏయూ ముస్తాబు

- రహదారులకు మరమ్మతులు
- వైస్ చాన్స్‌లర్ల సదస్సుకు సిద్ధం



సుందరంగా దర్శనమిస్తున్న ఏయూ పరిపాలన భవనం



వర్సిటీలో చురుగ్గా రహదారి పనులు



సుందరీకరణ పనులు చేస్తున్న కార్మికులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా దక్షిణ భారత విశ్వవిద్యాలయాల ఉపకులపతుల సమావేశం మంగళవారం ప్రారంభం కానుంది. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్, ఏయూ సంయుక్తంగా రెండు రోజుల పాటు ఈ సదస్సును నిర్వహించనున్నాయి. సదస్సును రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ మంగళవారం ఉదయం ప్రారంభించనున్నారు. ఏడు రాష్ట్రాలకు చెందిన వర్సిటీల వీసీలు హాజరు కానున్న నేపథ్యంలో ఏయూను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ పనులు రెండు రోజులుగా చురుగ్గా సాగుతున్నాయి.

- రహదారులకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లకు పెయింటింగ్‌లు వేశారు. ట్రాఫిక్ ఐలాండ్‌లు, రహదారికి ఆనుకుని ఉన్న భవనాలకు పెయింటింగ్‌లు వేసి ముస్తాబు చేశారు. ఏయూ పరిపాలన భవనం నుంచి బీచ్ రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్ వరకు వెళ్లే వివిధ మార్గాలను సుందరీకరిస్తున్నారు. వర్సిటీలోని పరిపాలన భవనం, జువాలజీ విభాగం, పర్యావరణ శాస్త్ర విభాగం, కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగానికి వెళ్లే మార్గాలకు మరమ్మతులు చేపట్టారు.
- వర్సిటీ పరిపాలన భవనం చుట్టు పక్కల, లోపల భాగంలో పచ్చని మొక్కలతో అలంకరించారు. పరిపాలనా భవనం చుట్టూ ఉన్న మొక్కలను ప్రూనింగ్ చేసి సుందరంగా తీర్చిదిద్దారు. నిరంతరం వర్సిటీ పారిశుధ్య సిబ్బంది రహదారులను శుభ్రం చేస్తున్నారు. విశ్వవిద్యాలయం పరిశుభ్రంగా సుందరంగా దర్శనమివ్వడంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అహింసా మూర్తికి ఘన నివాళి



గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు



ఆరిలోవ నెహ్రూనగర్‌లో గాంధీజీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అక్కరమాని విజయనిర్మల, తదితరులు

ఏయూ క్యాంపస్: అహింసా మూర్తి మహాత్మ గాంధీజీ వర్ధంతి సందర్భంగా సోమవారం ఉదయం ఏయూ పరిపాలనా భవనం వద్దనున్న ఆయన విగ్రహానికి వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్(ఏఐయూ) ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సురంజన్ దాస్, వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ జీడీ శర్మ, సెక్రటరీ జనరల్ డాక్టర్ పంకజ్ మిట్టల్.. బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని గాంధేయ అధ్యయన కేంద్రం గాంధీ సిద్ధాంతాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. నేటి సంఘర్షణతో నడిచే సమాజానికి గాంధీజీ ఆలోచనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రెక్టార్ ప్రొఫెసర్ కె.సమత, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కిషోర్‌బాబు, గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకుడు డాక్టర్ చల్లా రామకృష్ణ, విద్యాశాఖాధిపతి డాక్టర్ షారోన్‌రాజు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరనాథ్, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- ఏయూ తత్వశాస్త్ర విభాగంలో మహాత్మగాంధీ చిత్ర పటానికి విభాగాధిపతి వానపల్లి వెంకటరావు పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఆచార్యుడు ఎం.వి.కృష్ణయ్య, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు నెహ్రూనగర్‌లో జాతిపిత మహాత్మా గాంధీజీ చిత్ర పటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, మోహన్, హాన్సన్, బొండా రాము, అర్జున్, సూర్యారావు, శ్రీను, రాజులమ్మ పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: మహాత్మ గాంధీజీ వర్ధంతి కార్యక్రమాన్ని ఎంవీపీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించారు. మహాత్ముడి చిత్ర పటానికి వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, పార్టీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంతో సాకారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, పార్టీ నాయకులు పీతల గోవింద్, ముప్పల సురేష్, వాసుపల్లి ఎల్లాజీ, పిల్లా సత్యవతి, పండరీబాయ్ పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం

- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల
- 17వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న అక్కరమాని, తదితరులు

ఎంవీపీ కాలనీ: రాష్ట్రంలో బలహీన వర్గాల అభ్యున్నతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె 17వ వార్డు పెదవాల్తేర్ దళాయివారి వీధిలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు గురించి వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ పేదల సంక్షేమాన్ని సీఎం జగన్ ప్రభుత్వం ఒక సంకల్పంగా భావిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లినప్పుడు వారి నుంచి పెద్ద ఎత్తున హర్షం వ్యక్తమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మొల్లి అప్పారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలురకు నటనలో శిక్షణ



శిక్షణ శిబిరం ప్రారంభించి మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వీరయ్య

ఆరిలోవ: దీన్‌దయాళ్‌పురం వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహంలో నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నటన శిక్షణ శిబిరాన్ని గృహం సూపరింటెండెంట్ కె.వీరయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నటన ద్వారా మంచి ప్రవర్తన అలవడుతుందన్నారు. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఇలాంటి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. శిక్షణ శిబిరం ఏర్పాటు చేసిన అసోసియేషన్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యఅతిథి ఎన్.నాగేశ్వరరావు మాట్లాడుతూ నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ బాలలు కోసం పని చేస్తోందన్నారు. సుమారు దశాబ్దం నుంచి బాలలకు ఎన్నో శిక్షణ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ శిక్షణ శిబిరం ఇక్కడ బాలుర భవిష్యత్‌కు మార్గదర్శకంగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గృహం డిప్యూటీ సూపరింటెండెంట్ పి.రమణ, అసోసియేషన్ ప్రతినిధి పి.వి.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి పుష్పాభిషేకం



పుష్పాల అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లోని శ్రీవేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీవారి వార్షిక బ్రహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీవారికి పుష్పార్చన సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారు వివిధ రకాల పుష్పాల అలంకరణలో కనువిందు చేశారు. 75 కేజీల చామంతి, గులాబీ, కనకాంబరాలు తదితర పుష్పాలను స్వామివారికి అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. పుష్పార్చన అనంతరం యాగశాలార్చన, నిత్య పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్టీసీ బస్సులో మేయర్ ప్రయాణం



క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీకి వచ్చేందుకు బస్సు ఎక్కుతున్న మేయర్

దాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సోమవారం ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. తన క్యాంపు కార్యాలయం నుంచి నడుచుకుంటూ ఆర్టీసీ బస్టాప్‌కు చేరారు. సిటీ బస్సెక్కి సాధారణ ప్రయాణికుల వలే డబ్బులిచ్చి టికెట్ తీసుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ప్రయాణించి జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. చాలా మంది అధికారులు సొంత వాహనాల్లో కార్యాలయానికి వస్తున్నట్టుగా తెలిసిందని, సొంత, ప్రభుత్వ వాహనాలు విడనాడి ప్రైవేట్ వాహనాలపై రావాలని మేయర్ ఆదేశించారు.

సమాచారమ్

ఏయూ సంగీత విభాగంలో 3, 4 తేదీల్లో సదస్సు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సంగీత విభాగంలో వచ్చేనెల 3, 4 తేదీలలో సంగీత దర్శకులు, గాయకులు సాలూరి రాజేశ్వరరావు, ఘంటశాల వెంకటేశ్వరరావులపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు విభాగాధిపతి ఆచార్య ఎ.అనూరాధ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఘంటశాల, సాలూరి స్వర పరిచిన సంగీతంపై అతిథులు ప్రసంగాలు ఉంటాయని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఈ ఇద్దరు సంగీత దర్శకులను స్మరించుకుంటూ, వారి సేవలను గుర్తుచేస్తూ భవిష్యత్ తరానికి వారి సంగీత మాధుర్యాన్ని అందించడం సదస్సు ప్రధాన ఉద్దేశమన్నారు. విజయనగరం మహారాజ సంగీత కళాశాల విశ్రాంత అధ్యాపకుడు బి.ఎ.నారాయణ ఈ సదస్సులో పాల్గొని తన అనుభవాలను పంచుకుంటారన్నారు.

కేంద్ర కారాగారం సందర్శన



ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న డీఎల్‌ఎస్ కార్యదర్శి బులికృష్ణ

ఆరిలోవ: జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ సోమవారం విశాఖ కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఇక్కడ ఖైదీల బేరక్‌లు, వంటశాల, ఆస్పత్రి తదితర వాటిని పరిశీలించారు. సౌకర్యాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రిమాండ్ ఖైదీలకు న్యాయపరమైన విధానాలపై అవగాహన కల్పించారు. లీగల్ ఎయిడెడ్ డిఫెన్స్ కౌన్సిల్ గురించి తెలియజేశారు. ఖైదీలు న్యాయ సేవాధికార సంస్థ సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జైల్ అధికారులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

18న అంతర్జాతీయ సంగీత ప్రదర్శన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏజ్ కేర్ ఫౌండేషన్ ప్రతినిధి సాంబశివరావు, జిజా వల్సరాజ్, సుగంధి

బీచ్ రోడ్డు: క్యాన్సర్ రోగులకు నిధుల సేకరణలో భాగంగా వచ్చేనెల 18న అంతర్జాతీయ సంగీత ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు రోహిత్ మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి మీనాక్షి తెలిపారు. సోమవారం నగరంలోని ఒక హోటల్‌లో ప్రదర్శన పోస్టర్‌ను ఏజ్ కేర్ ఫౌండేషన్ ప్రతినిధి సాంబశివరావు, వీసీసీఐ ఉమెన్స్ వింగ్ అధ్యక్షుడు జిజా వల్సరాజ్, ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ మెడికల్ డైరెక్టర్ సుగంధి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ ఏడుగురు సంగీతకారులు, నృత్యాకారులతో కూడిన అంతర్జాతీయ బృందంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రదర్శన ద్వారా వచ్చిన విరాళాలను దేశ వ్యాప్తంగా క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. పూర్తి వివరాల కోసం 93486 23225, 99496 27222 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



నర్సరీ పెంచేందుకు అంటు కట్టిన మొక్కలతో విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: మొక్కల పెంపకం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. సోమవారం శివాజీపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో నర్సరీ మొక్కలు పెంచే కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చిన మట్టితో విద్యార్థులు పలు రకాల మొక్కలు పెంచేందుకు అంటుకట్టారు. ఈ సందర్భంగా జేవీ రత్నం మాట్లాడుతూ వాతావరణంలో పెరిగిపోతున్న కార్బన్‌డయాక్సైడ్‌ను అడ్డుకొనేవి మొక్కలు మాత్రమేనన్నారు. ఈ వాతావరణాన్ని సురక్షితంగా భావితరాలకు అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈ దిశగా విద్యార్థుల్లో చైతన్యం పెంచేందుకు నర్సరీల పెంపునకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మడగాస్కర్‌కు చెందిన ఏయూ సోషల్ వర్క్ విద్యార్థిని కసాండ్రా, పాఠశాల హెచ్‌ఎం కుమారి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్త రోడ్డు బ్రాంచి, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహించనున్నారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

బస్సులో గంజాయి అక్రమ తరలింపు

బీచ్ రోడ్డు: బస్సులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని మూడో పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బస్సులో ప్రయాణిస్తున్న తోటి ప్రయాణికుడు ఇచ్చిన సమాచారం మేరకు.. సత్యం జంక్షన్ వద్ద మూడో పట్టణ పోలీసులు బస్సును ఆపి తనిఖీ చేశారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు.. ఎక్కడికి తీసుకెళ్తున్నారు.. తదితర విషయాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

పందుల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్



పందులను తరలిస్తున్న సిటీ వెటర్నరీ విభాగం సిబ్బంది

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): నగర పరిశుభ్రతకు విఘాతం కలిగిస్తున్న పందుల నిర్మూలనకు జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నగరంలో భారీ స్థాయిలో పందులు కాల్చివేతతో పాటు నగరం నుంచి తరలింపు కార్యక్రమం చేపట్టినట్టు సిటీ వెటర్నరీ అధికారి డాక్టర్ కిషోర్ తెలిపారు. పెంపకందారులను పలుమార్లు హెచ్చరించినప్పటికీ వారిలో ఎటువంటి మార్పు కనిపించడం లేదని, అందుకు కఠిన చర్యలు చేపట్టామన్నారు. గాజువాక, జ్ఞానాపురం, మధురవాడ తదితర ప్రాంతాల్లో ఆర్మ్ రిజర్వ్‌డ్ పోలీసుల సహకారంతో పులివెందుల జంగారెడ్డిగూడెం నుంచి వచ్చిన 8 బృందాల ద్వారా సుమారు 621 వరకు పందులను పట్టుకుని ఇతర రాష్ట్రాలకు తరలించామని చెప్పారు. మరో 252 పందులను కాల్చి చంపామన్నారు. జీ–20 సదస్సు మార్చి నెలలో జరుగుతున్న దృష్ట్యా నగరం నుంచి పందులు పూర్తిగా నిర్మూలిస్తామని, కొంత మంది పెంపకందారులు ఇప్పటికే పందులను బయటకు తరలిస్తున్నారని వివరించారు. విధులకు ఆటంకం కలిగిస్తే పెంపకందారులపై చర్యలు తీసుకుంటామని డాక్టర్ కిషోర్ హెచ్చరించారు.

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం



కుష్టు రోగులకు బియ్యం అందిస్తున్న జిల్లా లెప్రసీ, టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు

మహారాణిపేట: కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన అవసరమని డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు అన్నారు. మహాత్మా గాంధీజీ వర్ధంతి సందర్భంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, టీబీ, లెప్రసీ నివారణ శాఖ సంయుక్తంగా ర్యాలీ నిర్వహించాయి. డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ప్రారంభమైన ప్రదర్శన టీబీ ఆస్పత్రి జంక్షన్ వరకు వెళ్లి తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుంది. తొలుత గాంధీ చిత్రపటానికి డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో కుష్టు వ్యాధి నిర్మూలన సాధ్యమన్నారు. జిల్లా లెప్రసీ, టీబీ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు మాట్లాడుతూ కుష్టు వ్యాధి రహిత జిల్లాగా విశాఖను చేయాలని పిలుపునిచ్చారు. వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యవేణి, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలు మనోజ్ వైభవ్ జెమ్స్ అండ్ జ్యూయలర్, మానవతా సేవా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 40 మంది కుష్టు రోగులకు బియ్యం, తువ్వాళ్లు అందజేశారు. అలాగే డ్రెస్సింగ్ కిట్స్ పంపిణీ చేశారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



అల్లిపురం: అనారోగ్యంతో చికిత్స పొందుతూ గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందారు. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి.. మునిబాబు (42) అనే వ్యక్తి కేజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేరారు. అనంతరం ఈ నెల 26వ తేదీన మృతి చెందినట్లు టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేశారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.రమణమూర్తి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయిన వ్యక్తి 5 అడుగుల 1 అంగుళం ఎత్తు కలిగి చామనఛాయగా ఉన్నాడని, తెలుపురంగు కట్ బనియన్, సిమెంట్ కలర్ ట్రాక్ ధరించి ఉన్నాడని తెలిపారు. వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 0891–2783672, 9490391090 ఫోన్ నంబరులో తెలియజేయాలని కోరారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా

సీతమ్మధార: స్థానిక రైతుబజార్‌లోని స్టాళ్లకు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు ఆధ్వర్యంలో సోమవారం డ్రా తీశారు. ఉదయం 93 కార్డులకు, సాయంత్రం 75 కార్డులకు సంబంధించిన స్టాళ్లకు డ్రా తీసి రైతులకు కేటాయించారు. పది రోజులకు ఒక సారి డ్రా తీస్తున్నట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.